


కోల్ రైల్‌కు సై





- ఓరుగల్లుకు రానున్న మూడు కొత్త రైల్వే మార్గాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్ర రైల్వేశాఖ మంజూరు
- రైల్వే లైన్‌లతో పెరగనున్న రవాణా, కనెక్టివిటీ
- కాజీపేట - భూపాలపల్లి లైన్ ప్రస్తావన కరువు

7

ఇటీవల కేంద్ర రైల్వేశాఖ ప్రకటించిన కొత్త రైల్వే ప్రాజెక్టులు ఓరుగల్లుకు భారీ ప్రయోజనాన్ని చేకూర్చనున్నాయి. కోల్‌బెల్ట్ ప్రాంతమైన రామగుండం నుంచి భూపాలపల్లి, ములుగు మీదుగా మణుగూరు వరకు నిర్మించే రైల్వేలైన్ బొగ్గు సరఫరాతో పాటు పర్యాటక అభివృద్ధిలో కీలకం కానుంది. అలాగే డోర్నకల్ జంక్షన్ నుంచి మిర్యాలగూడ, గద్వాల వరకు వేర్వేరు రైల్వేలైన్లు ఇతర తూర్పు, దక్షిణ రైల్వేలైన్లతో కనెక్టివిటీని పెంచటంతో పాటు బొగ్గు, బియ్యం, గ్రానెట్ తదితర వాటిని సరఫరా చేసే విధంగా కొత్త రైల్వే కారిడార్ అభివృద్ధికి అడుగులు పడనున్నాయి. అయితే కాజీపేట రైల్వే డివిజన్‌తో పాటు కాజీపేట - భూపాలపల్లి రైల్వేలైన్‌పై కేంద్రం ప్రకటన చేయకపోవటంపై ఓరుగల్లువాసుల్లో కొంత అసంతృప్తి వ్యక్తం అవుతోంది. - ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



గంధంపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

వ్యాధులు వ్యాపించకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అద్వైత్ కుమార్

బయ్యారం, ఆగస్టు 13 : జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మంగళవారం బయ్యారం మండలంలో పర్యటించారు. తొలుత నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)ను సందర్శించిన జిల్లా కలెక్టర్ పాఠశాల్లోని హాస్టల్‌ను తనిఖీ చేశారు. డైనింగ్, కిచెన్, క్లాస్ రూమ్స్, గ్రౌండ్ తదితర పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బయ్యారం, గందంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఇర్సులాపురం ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రుల్లోని సౌకర్యాలతో పాటు ఫార్మసీ, ల్యాబ్‌తో పాటు రిజిస్టర్లను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ఇంటింటి సర్వే చేపట్టి వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఫైలేరియా (ఎండీఏ) బోదకాలు నివారణ కార్యక్రమం విస్తృతంగా చేపట్టాలన్నారు. ఫైలేరియాపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట బయ్యారం తహసీల్దార్ విజయ, ఎంపీడీవో దైవాదీనం, ఏకలవ్య ఆర్సీవో హరిసింగ్, వైద్యాధికారులు సాగర్, విజయ్ కుమార్‌తో పాటు కళావతి, రజిత, పవన్ పాల్గొన్నారు.


నేటి నుంచి మార్కెట్‌కు సెలవులు

కేసముద్రం, ఆగస్టు 13 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 14 నుంచి 19 వరకు సెలవులు ఉన్నట్లు ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు తెలిపారు. ఈ నెల 14న వ్యాపారులు, గుమస్తాల కోరిక మేరకు, 15న స్వాతంత్ర్య దినోత్సవం, 16న వరలక్ష్మి వ్రతం, 17, 18 శని, ఆదివారాంతం, 19న రాఖీపౌర్ణమి సందర్భంగా సెలవులు ఉన్నాయని రైతులు గమనించి తమ సరుకులను 20న మార్కెట్‌కు తీసుకురావాలని కోరారు.

మొక్కజొన్న పంటలపై జాగ్రత్తలు వహించాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 13 : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహబూబాబాద్‌లోని రైతు వేదికలో రైతులతో వ్యవసాయశాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి రైతులకు సూచనలు చేయగా మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజేందర్‌నగర్‌కు చెందిన మేజ్ రిసెర్చ్ స్టేషన్‌కు చెందిన ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ భద్రు పలు సూచనలు చేశారు. సిరిసిల్ల అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి విత్తనశుద్ధిపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు, ఏడీఏ ఎం.లక్ష్మినారాయణ, వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి, ఏఈవోలు మంగ శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, లావణ్య, సాయిచరణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్ యూటీఎఫ్ ముందంజ



ఎస్‌టీఎఫ్ఐ స్వర్ణోత్స వేడుకల్లో పాల్గొన్న టీఎస్-యూటీఎఫ్ నాయకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13 : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో టీఎస్-యూటీఎఫ్ ముందుంటుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం యూటీఎఫ్, ఎస్‌టీఎఫ్ఐ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకొని యూటీఎఫ్ పతాకాన్ని మల్లారెడ్డి, ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా, అధ్యయనం అధ్యాపనం సామాజిక స్పృహ లక్ష్యాలుగా అందరిని కలుపుకుంటూ ముందుకు సాగుతున్న ఏకైక సంఘం టీఎస్ యూటీఎఫ్ అన్నారు. సంఘం ఏర్పడిన నాటి నుంచి విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. సీపీఎస్ రద్దు చేసే వరకు నేటి యువతరం పోరాడాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యా రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు యాకూబ్, హరినాయక్, సంజీవ, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, సురేష్, రాంజీ, మైసయ్య, ప్రేమ్‌కుమార్, బాలరాజు, వీరభద్రం, ప్రభాకర్, ప్రసాద్, బాబు, రాజు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మానుకోట అభివృద్ధికి కృషి

- సీఎం రేవంత్‌రెడ్డి కృషితో అమృత్ 2.0 పథకం నిధులు
- మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 13 : పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా కేంద్రంగా ఉన్న మానుకోట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్థానిక పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో అమృత్ 2.0 పథకం ద్వారా రూ.28.43 కోట్లతో చేపట్టనున్న విలీన గ్రామాలకు తాగునీటి పైపులైన్, మూడు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ.. అమృత్ 2.0 పథకం ద్వారా మునిసిపల్ విలీన గ్రామాల తాగునీటి సమస్య పరిష్కారం కానుందని చెప్పారు. మునిసిపల్ అధికారులు ప్రతి మూడు నెలల కొకసారి సమీక్షా సమావేశాలు నిర్వహించి ఏమి అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని, ఎంత నిధులు అవసరం అన్న కోణంలో నివేదికలు తయారు చేయాలని సూచించారు. ఆ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తే వీటిని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి నిధులు తీసుకురానున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి వల్ల అమృత్ 2.0 పథకం ద్వారా పెద్దఎత్తున మానుకోట తాగునీటి పనుల కోసం నిధులు మంజూరయ్యాయని అందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మానుకోట జిల్లా కేంద్రంలో ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణం కోసం కేంద్రమంత్రి గడ్కరీతో మాట్లాడానని చెప్పారు. అదే విధంగా అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా మానుకోటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలన్నారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమృత్ 2.0 పథకం ద్వారా విలీన గ్రామాల నీటి సరఫరా కోసం మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులు, 22.25 కిలో మీటర్ల మేర మెయిన్, 10 కిలో మీటర్ల మేర డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా, పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి శంకుస్థాపన ప్రాంతానికి ఎంపీ, ఎమ్మెల్యే బైక్ ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నోముల రవీందర్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈ ఉపేందర్, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్లు బి. అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, చిట్యాల జనార్ధన్, కౌన్సిలర్లు ఎడ్ల వేణు, పోతురాజు రాజు, దండెబోయిన బుజ్జి వెంకన్న, బానోత్ హరిసింగ్, బోనగిరి గంగాధర్, మార్నేని రఘు, కోడి శ్రీనివాస్, షేక్. ఖలీల్, నిమ్మల శ్రీనివాస్, రంగ్యా ఎడ్ల రమేష్, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, మార్నేని కిరణ్, ఏఈలు కుమార్, సురేష్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి రాష్ట్ర సర్కార్ కృషి : ఎమ్మెల్యే మురళీనాయక్

మానుకోట మునిసిపల్ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. 1964 సంవత్సరంలో అప్పటి 5 వేల జనాభా కనుగుణంగా వేసిన తాగునీటి పైపులైన్ ద్వారానే నేటికి నీటి సరఫరా జరుగుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాలీచాలనీ నిధులతో మిషన్‌భగీరథ పనులు చేశారని, దీంతో నీటి సమస్య పరిష్కారానికి నోచుకోలేదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇంటర్నల్ పైపులైన్ కోసం ముఖ్యమంత్రి సలహాదారు వేం.నరేందర్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే రాష్ట్ర సర్కార్ రూ.20 కోట్లు మంజూరి చేసిందని, ఇప్పుడు అమృత్ 2.0 ద్వారా రూ.28.43 కోట్లు విలీన గ్రామాల తాగునీటి అభివృద్ధి పనులకు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రాబోయే 50సంవత్సరాల వరకు పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకుని తాగునీటి పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ చేయూత

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్



డోర్నకల్ మునిసిపల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జాటోతు రాంచంద్రునాయక్

డోర్నకల్, ఆగస్టు 13 : స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనందిస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని జైన్ భవన్‌లో మంగళవారం స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీల ద్వారా మంజూరైన రూ.29.75 కోట్ల చెక్కులను అందించారు. రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. మహిళ సంఘాల సభ్యులకు సున్నా వడ్డీకే రుణాలు అందిస్తుందన్నారు. అనంతరం డోర్నకల్ మునిసిపల్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మునిసిపాలిటీలో గతంలో చేపట్టిన, ప్రస్తుతం చేపట్టబోయే పనుల వివరాలను సభలో అడిగి తెలుసుకున్నారు. గతంలో తాము చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కౌన్సిలర్లు పోట జనార్ధన్, తేజావత్ సంధ్యారాణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తాను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మునిసిపాలిటీలో చెత్త సేకరించే వాహనాలు రావడం లేదని, వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్లు పర్వీన్ సుల్తానా, సంధ్యారాణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చెత్త సేకరించే వాహనాలు ఎప్పుడు వచ్చేది.. ఎప్పుడు పోయేది తెలియడం లేదని వాపోయారు. రిపేర్లు, వాహనాల మరమ్మతుల పేరిట మాత్రం అనవసరమైన ఖర్చుల బిల్లుల చూపిస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. తొలుత డోర్నకల్ ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. కాగా, డోర్నకల్‌ను థర్డ్‌గ్రేడ్ మునిసిపాలిటీ నుంచి మేజర్ గ్రామ పంచాయతీగా మార్చాలని మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మునిసిపాలిటీగా ఆవిర్భవించడంలో పన్నుల భారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో డోర్నకల్ మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణవేణి, సెర్ప్ ఏపీఎం శంకర్‌నాయక్, మునిసిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ కోటిలింగం, నాయకులు సుమీర్‌చంద్‌జైన్, మాద శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

గురుకుల హాస్టల్‌లో ప్రభుత్వ విప్ నిద్ర



మరిపెడ ఎస్సీ గురుకులంలో విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న రాంచంద్రునాయక్

మరిపెడ, ఆగస్టు 13 : ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్ మంగళవారం రాత్రి మరిపెడలోని ఎస్సీ గురుకుల హాస్టల్ నిద్రకు ఉపక్రమించారు. కాసేపు ఆయన విద్యార్థులతో మాట్లాడారు. తాను పూర్వపు హాస్టల్ విద్యార్థినేనని విద్యార్థులకు గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలికల గురుకుల, హాస్టల్ విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకునేందుకు ఎమ్మెల్యేలను, మంత్రులను, ఎమ్మెల్సీలను, ఉన్నతాధికారులను ఆకస్మికంగా గురుకుల స్కూల్స్, హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకొని అక్కడికి అక్కడికే పరిష్కరించాలని ఆదేశించిన విషయం విద్యార్థులకు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్‌ను సందర్శించాలని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థులు ప్రభుత్వం కలిపిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట స్థానిక అధికారులు, కాంగ్రెస్ నేతలు, గురుకుల ప్రిన్సిపాల్, టీచర్లు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అతిథిగా..

ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్

మహబూబాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు జాటోతు రాంచంద్రునాయక్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లో ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ పతకాలను ఆవిష్కరించే మంత్రులు, విప్‌లతో కూడిన జాబితాను విడుదల చేశారు. ఇందులో మహబూబాబాద్ జిల్లాకు ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్‌ను ఎంపిక చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ నెల 15న ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు జాటోతు రాంచంద్రునాయక్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్నారు.

జిల్లాలో 9 మంది ఎస్సైల బదిలీలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 13 : జిల్లాలో 9 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దవంగర ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జి.ఉపేందర్ తొర్రూరు ఎస్సైగా, మహబూబాబాద్ టౌన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.అరుణ వీఆర్ మహబూబాబాద్‌కు, డీఎస్‌బీ మహబూబాబాద్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వంశీధర్ డోర్నకల్‌కు, డీసీఆర్బీ మహబూబాబాద్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.లింగయ్య సీసీఎస్ మహబూబాబాద్‌కు, ఐటీసెల్ మహబూబాబాద్‌లో ఎస్సైగా పనిచేస్తున్న ఆర్.వెంకటరమణను మహబూబాబాద్ టౌన్ ఎస్సైగా, డోర్నకల్-1 ఎస్సైగా పనిచేస్తున్న బి.సంతోష్‌ను డీఎస్‌బీ మహబూబాబాద్‌కు, సీసీఎస్ మహబూబాబాద్‌లో ఎస్సైగా పనిచేస్తున్న జి.ఉమను మహబూబాబాద్ టౌన్ ఎస్సైగా, డీఎస్‌బీలో ఎస్సైగా పనిచేస్తున్న డి.నాగేశ్వర్‌రావును మహబూబాబాద్ ట్రాఫిక్ ఎస్సైగా, డీసీఆర్బీలో ఎస్సైగా పనిచేస్తున్న సీహెచ్.అమరేందర్‌రెడ్డిను షీటీమ్ ఎస్సై మహబూబాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా వైద్యాధికారి మురళీధర్



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో మురళీధర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13 : ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి మురళీధర్ అన్నారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు జిల్లా స్థాయిలో మారథాన్ రెడ్ రన్, క్విజ్, డ్రామా, రిల్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేసి, ప్రశంసా పత్రాలతో పాటు నగదు అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాద్, డీపీఎంవో రవీందర్‌రావు, హెచ్‌ఈవో రాజు, దిశ ప్రోగ్రాం అధికారులు జ్యోతి, సారయ్య, డీఎండీవో సాయి, సిబ్బంది రమేష్, జ్యోతి, అధికారులు రమేష్, మానస, ప్రిన్సిపాల్స్ లక్ష్మానాయక్, వెంకటేశ్వర్లు, సిరినాయక్, ఎన్జీవో ప్రతినిధి శాంతరాజు పాల్గొన్నారు.

భేష్ బిట్టు!

పోలీసు జాగిలానికి ఘనంగా ఉద్యోగ విరమణ

సేవలను కొనియాడిన సీపీ



వరంగల్ క్రైం, ఆగస్టు 13: 11 ఏళ్ల పాటు పోలీసు విభాగంలో సేవలందించిన బిట్టు (పోలీస్ జాగిలం)కు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళవారం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బిట్టును సీపీ అంబర్ కిషోర్ ఝూ ఘనంగా సత్కరించి చేసిన సేవలను కొనియాడారు. 2013 డిసెంబర్ 26న కమిషనరేట్ జాగిలాల విభాగంలో చేరి బిట్టు పోలీస్‌శాఖకు సేవలందించింది. ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు ఇతర వీఐపీలు కమిషనరేట్ పరిధిలో పర్యటించినప్పుడు పేలుడు పదార్థాలు గుర్తించడంలో బిట్టు కీలకపాత్ర పోషించింది. బిట్టుకు హ్యాంగ్లర్‌గా కానిస్టేబుల్ ప్రభాకర్ వ్యవహరించాడు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసుశాఖలో జాగిలం పాత్ర కీలకమన్నారు. పేలుడు పదార్థాలను గుర్తించడంతో పాటు మత్తు పదార్థాలు గుర్తించడంలోనూ జాగిలాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్‌ఐలు శ్రీనివాస్, స్పర్జన్‌రాజ్, శ్రీధర్, చంద్రశేఖర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు అతిథిగా మంత్రి సురేఖ

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 13: హనుమకొండలోని పోలీస్ పరేడ్‌గ్రౌండులో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను మంత్రి చేతులమీదుగా అందజేస్తారు.

కోల్ రైల్‌కు సై!

ఓరుగల్లుకు రానున్న మూడు కొత్త రైల్వే మార్గాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కోల్‌రైల్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 1998 నుంచి భూపాలపల్లి కోల్‌బెల్ట్‌కు రైల్వే లైన్ నిర్మాణం చేయాలనే డిమాండ్ ఉంది. ఎట్టకేలకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ కోల్‌రైల్‌పై ప్రకటన చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు 207కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మిస్తున్నట్లుగా పేర్కొన్నారు. దీనికోసం డీపీఆర్‌లు సిద్ధం చేశారు. అటవీ శాఖ నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు లేకపోవటం కొంత జాప్యం జరుగుతోంది. అయితే రెండు మూడు నెలల్లో తుది అనుమతులు మంజూరు కానున్నాయని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

రామగుండం నుంచి మణుగూరు వరకు 207కి.మీ.ల రైల్వేలైన్ కోసం సుమారు రూ.4,100 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2013-14లో రామగుండం - మణుగూరు రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే చేయగా, 207కిలోమీటర్ల రైల్వేలైన్‌కు రూ.1,112కోట్లతో ఈ రైల్వే లైన్ నిర్మించవచ్చునని ప్రతిపాదన చేశారు. పదేళ్లలో ఈ అంచనా వ్యయం నాలుగు రేట్లు పెరిగింది. ఇక ఈ లైన్ పూర్తి అయితే భూపాలపల్లికి రైల్ కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీంతో బొగ్గు దిగుమతి, ఎగుమతికి కష్టాలు తప్పనున్నాయి. అలాగే రామగుడం నుంచి భూ పాలపల్లి మీదుగా మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణంతో థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు సరఫరా సులభం కానుంది. ప్రస్తుతం భూపాల పల్లిలోని కేటీపీపీకి బొగ్గును రామగుండం నుం చి రైల్ ద్వారా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేస్టేషన్‌కు దిగుమతి చేసుకుంటున్నారు. ఉప్పల్ నుంచి 70కిలో మీటర్లు ప్రయాణించిన పరకాల మీదుగా కేటీపీపీకి బొగ్గును సరఫరా చేస్తున్నారు. దీంతో అధిక వ్యయంతో పాటు సమయానికి బొగ్గు కేటీపీపీకి చేరటం లేదు.

అలాగే ఈ రైల్వేలైన్ ఏరియాలోనే రామగుండం సమీపంలోని 2,600 మెగావాట్ల ఎన్‌టీపీసీ విద్యుత్ కేంద్రంతో పాటు 1,600 మెగావాట్ల తెలంగాణ ఎన్‌టీపీసీ ప్రాజెక్టు, అలాగే జైపూర్‌లోని జెన్‌కోకు చెందిన 6,200మెగావాట్లు, 11 మెగావాట్లు విద్యుత్ కేంద్రాలు భూపాలపల్లిలో ఉన్నాయి. మణుగూరు సమీపంలోని 1,200 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు కూడా రైల్‌మార్గం అందుబాటులో లేదు. ఈ లైన్‌తో బొగ్గు సరఫరా ఈ పరిశ్రమలకు సులభతరం కానుంది. అలాగే కొత్త రైల్వేలైన్‌తో పర్యాటక రంగానికి పండుగ కానుంది. రామగుడం నుంచి మణుగూరు వరకు అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. వీటన్నింటినీ లింకు చేసుకుంటూ లైన్ నిర్మాణం చేయనున్నారు. ప్రధానంగా మంథని, కాళేశ్వరం, రామప్ప, మేడారం, లక్నవరం, ఏటూరునాగారం అభయారణ్యం, బొగత, మల్లూరు తదితర పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు సమీపం నుంచి మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణం సాగనుంది. దీంతో ఈ రైల్వేలైన్‌తో పర్యాటకానికి కొత్త కళ రానుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

డోర్నకల్ టు మిర్యాలగూడ, గద్వాల

రైల్వేశాఖ ప్రకటించిన కొత్త ప్రాజెక్టుల్లో కీలకమైనది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ రైల్వే లైన్. ఈ ప్రాజెక్టు కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల అంచనాలతో డీపీఆర్ తయారు చేశారు. డోర్నకల్ నుంచి మహబూబాబాద్, ఖమ్మం జిల్లా ముదిగొండ, రాజేశ్వరపురం, నేలకొండపల్లి, కోదాడ మీదుగా మిర్యాలగూడ చేరుతుంది. ఈ లైన్‌తో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, న్యూఢిల్లీకి అనుసంధానమవుతుంది. దీంతో యాదాద్రి పవర్ ప్లాంట్ వరకు భూపాలపల్లి నుంచి బొగ్గును, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం నుంచి ధాన్యం, బియ్యం, గ్రానైట్ పరిశ్రమలకు, సిమెంట్ పరిశ్రమలకు సరుకులను రవాణా, షుగర్ ఫ్యాక్టరీల నుంచి చెక్కర సరఫరా చేసేందుకు మార్గం సుగమమవుతుంది.


అలాగే డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కిలో మీటర్ల రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైన్ కోసం రూ.5వేల కోట్లతో అంచనాలను రూపొందించింది. ఈ లైన్‌తో వరంగల్ మీదుగా హైదరాబాద్, విజయవాడ సాగే లైన్‌తో మహబూబ్‌నగర్ మీదుగా హైదరాబాద్, బెంగూళూరు లైన్‌ను అనుసంధానం చేస్తున్నారు. కీలకమైన రెండు మార్గాలను అనుసంధానంతో పాటు కొత్తగా రైల్వేలైన్ లేని ప్రాంతాలకు కూడా రైల్వే కనెక్టివిటీ జరుగుతుంది. ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపే ఈ లైన్‌తో డోర్నకల్ జంక్షన్ మరింత కీలకంగా మారనుంది. వీటితో పాటు పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి వరంగల్ వరకు 1,316కిలో మీటర్ల రైల్వే కనెక్టివిటీకి కేంద్ర రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఈప్రాజెక్టుకు సుమారు రూ.7,382కోట్లు ఖర్చు చేస్తుంది. భద్రాచలం వద్ద నిర్మించే కొత్త స్టేషన్‌తో వరంగల్ రైల్వేలైన్‌కు అనుసంధానం అవుతుంది. గిరిజనుల అధికంగా ఉండే ప్రాంతాల గుండా ఈ రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా బొగ్గు సరఫరాతో పాటు ప్రకృతి వైపరిత్యాల సందర్భాల్లో ప్రత్యామ్నాయం లైన్‌గా ఇది పని చేస్తుందని రైల్వేశాఖ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆరు ప్రాజెక్టుల్లో నాలుగు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రయోజనం చేకూర్చేవే కావటం విశేషం.

అటకెక్కిన కాజీపేట - భూపాలపల్లి లైన్

కాజీపేట-భూపాలపల్లి మధ్య రైల్వేలైన్‌కు 2023-24 బడ్జెట్‌లో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) కోసం రైల్వే శాఖ రూ.1,152కోట్ల నిధులు మంజూరు చేసింది. కాజీపేట నుంచి హసన్‌పర్తి లైన్ మీదుగా కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని మత్రిపల్లి గ్రామం వద్ద సైడ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. మత్రిపల్లి ట్రాక్ నుంచి చిట్యాల మండలం జడలపేట మీదుగా భూపాలపల్లి వరకు ఈ లైన్ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే 2023-24లో నిధులు కేటాయించినప్పటికీ పనులు ముందుకు సాగలేదు. దీంతో 2024-25 బడ్జెట్‌లో కాజీపేట- భూపాలపల్లి రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ రాలేదనే విమర్శలున్నాయి. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కాజీపేట-భూపాలపల్లి లైన్‌పై దృష్టి పెట్టి రైల్వేశాఖపై ఒత్తిడి తీసుకురావాలని ఓరుగల్లువాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఊసేలేని రైల్వే డివిజన్

కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్ మీదుగా ప్రతీరోజు సుమారు 200కు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ అదాయం వచ్చే జంక్షన్‌లల్లో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా చేయటంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు ఉన్నాయి.





నేత కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

మడికొండ, ఆగస్టు 13: కాంగ్రెస్ ప్రభుత్వం నేత కార్మికులకు అండగా ఉండి ఆదుకుంటోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం మడికొండలోని టెక్స్‌టైల్ పార్కులో సిడ్‌బీ క్లస్టర్ ఇంటర్వెన్షన్ ప్రొగ్రామ్ ఏజీఎం స్మృతివాజ్‌పేయి ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన లాంచ్ వర్క్‌షాప్ కమ్ ఆడాప్షన్ ఆఫ్ గ్రీన్ టెక్నాలజీ సెమినార్‌లో వరంగల్ ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పొట్టచేతపట్టుకొని సూరత్, షోలాపూర్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సొంత రాష్ట్రంలో తమ తల రాతలు మారతాయని నమ్మి వచ్చిన నేత కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, నేత కార్మికులకు సైతం తగిన న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. తన శక్తి మేరకు నేత కార్మికులకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంట్‌లో మాట్లాడి జిల్లాకు వెల్‌నెస్ సెంటర్ తీసుకువచ్చానని తెలిపారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పార్కులో యూనిట్లు సక్రమంగా నడుస్తున్నాయని భావించానని, క్షేత్రస్థాయిలో నేత కార్మికుల పరిస్థితి వేరే విధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం నేత కార్మికులను నిర్లక్ష్యం చేసిందన్నారు. నేతకార్మికులు తనతో సమావేశమై తమ సమస్యలు పూర్తిగా తెలిపినట్లయితే వారిని మంత్రి కొండా సురేఖ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాకతీయ టెక్స్‌టైల్ అండ్ వీవర్స్ వెల్‌ఫేర్ పొదుపు, పరస్పర సహాయక సహకారం సంఘం అధ్యక్షుడు ఊరుకొండ శ్రీరాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభించిన టెక్స్‌టైల్ పార్కులో 164 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి ప్రారంభించాయని, వాటికే లోన్లు వచ్చాయని, మిగతా 200యూనిట్లకు లోన్‌లు మంజూరు కాకపోవడంతో ఖాయిలా పడ్డాయన్నారు. వాటికి ప్రభుత్వం సబ్సిడీగానీ, విద్యుత్ సబ్సిడీ గానీ రానందున యూనిట్లు ఉత్పత్తి చేయడంలేదని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించే స్కూల్ యూనిఫామ్‌లు, సింగరేణి వంటి సంస్థలకు ఇచ్చే యూనిఫామ్‌లకు చెందిన వస్త్రాలను నేసే పనిని తమకు ఇప్పించినట్లయితే నేత కార్మికులను ఆదుకున్నట్లవుతుందని తెలిపారు. ఈ మేరకు ఎంపీ, ఎమ్మెల్యే చొరవచూపి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దర్గా స్వామి, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, కోశాధికారి ఆముదాల జ్యోతిబాస్కర్, డైరెక్టర్లు సదానందం, రాధిక తిరుపతి నేత కార్మికులు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వస్కుల శంకర్, బిల్ల రవిందర్, వస్కుల నాగరాజు, కుర్ల మోహన్, కొప్పుల నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కడియం కావ్య







ఇంటర్ ఆర్జేడీ కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలి

ఉత్తర్వులు జారీ చేసిన ఇంటర్ విద్య డైరెక్టర్ శృతి ఓఝూ

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించిన ఇంటర్మీడియెట్ ఆర్జేడీ కార్యాలయాన్ని వెంటనే వరంగల్‌లో తిరిగి ప్రారంభించాలని ఇంటర్మీడియెట్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓఝూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాలయ భవనం సమకూరే వరకు ప్రస్తుతానికి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయాలని ఆమె ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఆర్జేడీ కార్యాలయం తరలింపునకు ముందు పనిచేసిన ఆర్జేడీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌తో పాటు అందరూ సిబ్బంది తిరిగి ఆర్జేడీ కార్యాలయంలో విధుల్లో చేరాల్సిందిగా ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఆర్జేడీ కార్యాలయం తిరిగి వరంగల్‌లో ఏర్పాటు కానుండటంతో వివిధ అధ్యాపక సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ బృంద గీతాల పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఈనెల 31న జాతీయ బృందగీతాల పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుధీర్‌కుమార్, కె.సత్యనారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రంలోని సామా జగన్మోహన్ స్మారక భవనంలో 6 నుంచి 10 తరగతులు చదివే విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి 6 నుంచి 8 మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22లోగా పోటీల కన్వీనర్ కమలమనోహర్ (944060 4347)కు వివరాలను పంపించాల్సిందిగా వారు కోరారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో నిట్‌కు 21వ ర్యాంకు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) నిట్‌కు ఇంజనీరింగ్ కేటగిరిలో 21వ ర్యాంకు దక్కింది. సోమవారం సాయంత్రం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో నిట్‌కు ఓవరాల్ కేటగిరిలో 53వ ర్యాంకు సాధించింది. మేనేజ్‌మెంట్ విభాగంలో 100వ ర్యాంకును పొందింది. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులను క్షుణ్ణంగా విశ్లేషిస్తామని, మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు.

కాంగ్రెస్ సర్కార్‌తోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 13 : రాష్ట్రంలో నిరుపేదలందరిరీ కాంగ్రెస్ సర్కార్ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైల్వే స్టేషన్‌లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌ల కోసం కృషి చేస్తానని స్పష్టంచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ రూ.2లక్షలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అన్నదాతల కళ్లలో ఆనందం వెల్లివిరియాలన్నదే కాంగ్రెస్ సర్కార్ స్వప్నమని, అందుకోసం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలి పారు. మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ భూమి సరిపడ చూపించకపోవడంతోనే గిరిజన యూనివర్శిటీ ములుగుకు తరలిపోయిందని చెప్పారు. చెరువులు, కుంటలు అన్యాక్రాంతమవుతున్నాయని వాటి పరిరక్షణకు అందరం కలిసి కట్టుగా కృషిచేద్దామన్నారు. మానుకోట అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. తొలుత మహబూబాబాద్ మండల పరిధిలోని 103 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాషా, పోతురాజు రాజు, భూక్య శ్రీను, రియాజ్ అన్సారీ, బోళ్ల రాజు, నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

ఖాతా నుంచి రూ.92 వేలు మాయం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 13 : ఓ అపరిచిత వ్యక్తి నుంచి సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ మెసేజ్‌తో మహబూబాబాద్ జిల్లా కేంద్రం నెహ్రూసెంటర్‌లోని ఓ వ్యాపారి బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.92 వేలు మాయమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... నెహ్రూసెంటర్‌లో వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్న శేషగాని శ్రీనివాస్ మొబైల్‌కు మొబిక్విక్ ద్వారా ఓటీపీ వచ్చింది. ఆ తర్వాత ఓ అపరిచిత వ్యక్తి నుంచి కాల్ వచ్చి మీకు వచ్చిన ఓటీపీ నెంబర్ చెప్పాలని కోరాడు. దీంతో సదరు వ్యాపారి తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబర్ చెప్పాడు. దీంతో తన అకౌంట్‌లో ఒకసారి రూ.32 వేలు, మరోసారి రూ.60వేలు వెరసి రూ.92 వేలు మాయమయ్యాయి. దీన్ని గుర్తించిన వ్యాపారి ఈ విషయంపై టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాల దరఖాస్తుల గడువు ఈ నెల 17

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13 : మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు గడువును ఈ నెల 17 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి మంగళవారం తెలిపారు. 14ఏళ్లు పూర్తై పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు iti.telangana.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పత్తి సాగులో యాజమాన్య పద్ధతి పాటించాలి

నర్సింహులపేట, ఆగస్టు 13: పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధ్యమని మండల విస్తరణ అధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని కొమ్ములవంచ, రూప్లాతండాల్లో మంగళవారం పర్యటించి పత్తి పంటలను పరిశీలించారు. సాగు విధానం రసంపీల్చు పురుగుల తీవ్రతపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మౌనిక, రైతులు ఉన్నారు.

ఆపదలో డయల్ 100కు కాల్‌చేయండి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 13 : ఎలాంటి పరిస్థితుల్లోనైన ఆపద వస్తే వెంటనే డయల్ 100కు కాల్‌చేస్తే పోలీస్ అధికారులు, సిబ్బంది సకాలంలో చేరుకుని సమస్య పరిష్కరిస్తారని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఆపద వచ్చినా.. ప్రమాదం సంభవించిన.. ఎక్కడ ఉన్నా.. తోడు ఎవరు లేకున్నా.. ఎంత దూరంలో ఉన్నా సరే డయల్ 100కు ఫోన్ చేస్తే మీ క్షేమమే బాధ్యతగా.. మీ సురక్షితం.. మా కర్తవ్యంగా మీ ముందు ఉంటామని చెప్పారు.

18న బాస్కెట్ బాల్ జిల్లా స్థాయి ఎంపికలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల బాస్కెట్ బాల్ క్రీడా మైదానంలో ఈ నెల 18న బాస్కెట్ బాల్ జిల్లా స్థాయి ఎంపికలు జరగనున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముల్లంగి ప్రతాప్‌రెడ్డి మంగళవారం తెలిపారు. అండర్-16 విభాగంలో బాల, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు 1-1-2008 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. తమ వెంట ఒరిజినల్ ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం తీసుకురావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 99852 33882ను సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో పాల సేకరణ పెంచాలి

తొర్రూరు రూరల్, ఆగస్టు 13 : మండలంలోని అన్ని గ్రామాల్లో పాల సేకరణ పెంచాలని వరంగల్ విజయ డైరీ డీడీ శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం తొర్రూరు మండలంలోని వెల్లికట్టె గ్రామశివారులోని పాలకేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. పాడిరైతులకు ప్రభుత్వ అన్ని రకాల ప్రోత్సహకాలు అందిస్తుందన్నారు. పోత్సాహకంగా రూ.4ఇన్‌సెంటివ్స్‌తో పాటు, పశువుకుల దాన మినరల్‌మిక్సర్ అందజేస్తుందన్నారు. రైతులకు సకాలంలో ప్రతి 15 రోజులకు ఒక్కసారి బిల్లుల ఇవ్వాలని పాలఉత్పత్తిని పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. భూమి అన్యక్రాంతం కాకుండా చర్యలు చేపడుతామన్నారు.

విద్యార్థులకు టై, బెల్టు, షూల అందజేత


టై, బెల్టు, షూలను అందజేస్తున్న ఎసల్ల కట్టయ్య

కేసముద్రం, ఆగస్టు 13 : ఉన్నతస్థాయికి ఎదిగినా తాను విద్యాభ్యాసం చేసిన పాఠశాల, స్వగ్రామంపై మమకారం ప్రత్యేకంగా ఉంటుందనడానికి ఇదో నిదర్శనం. కేసముద్రం మండలం ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు రూ.30వేలు వెచ్చించి టై, బెల్టు, బ్యాడ్జీ, ఐడీ కార్డు, షూలను ఇదే గ్రామానికి చెందిన హైదరాబాద్ అసిస్టెంట్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్) ఎసల్ల అప్పయ్య సమకూర్చారు. ఈ మేరకు మంగళవారం ఆ పాఠశాలలో అప్పయ్య తండ్రి ఎసల్ల కట్టయ్య చేతుల మీదుగా వీటిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయసుశీల, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 13 : మొక్కలు నాటి పర్యావరణాన్ని పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మరియన్న అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ఐటీసీ-ఎంఎస్‌కే భద్రాచలం సహకారంతో ఎఫర్ట్ సేవాసంస్థ ఆధ్వర్యంలో బయోడైవర్సీటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కె.రమేష్, ఆర్గనైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య యోధుల యాదిలో..

కేసముద్రం, ఆగస్టు 13 : కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించు కొని 14 రోజులుగా 'స్వాతంత్ర్య సమరయోధుల యాదిలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీరోజు ప్రార్థన సమయంలో 14మంది స్వాతంత్ర్య యోధుల జీవితచరిత్రను రోజుకొకరి చొప్పున విద్యార్థులకు వివరించారు. 1857సిపాయి తిరుగుబాటు నుంచి స్వాతంత్ర్యం సిద్ధించే నాటి వరకు జరిగిన పరిణామాలు, పోరాటాలను, దేశంకోసం అసువులు బాసిన వీరుల చరిత్రను విద్యార్థులకు వివరించినట్లు హెచ్‌ఎం బందెల రాజు తెలిపారు. కొన్ని పోరాట ఘట్టాలను, చారిత్రాత్మక ఘటనలను డిజిటల్ తరగతి గదిలో ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

అవయవదానానికి ముందుకు రావాలి

కురవి, ఆగస్టు 13 : అవయవదానానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలని తెలంగాణ నేత్ర, అవయవ శరీర దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు.కురవిలో మంగళవారం దేవరశెట్టి మల్సూర్ అధ్యక్షతన ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అశోక్ మాట్లాడుతూ.. అవయవదానంలో తెలంగాణ రాష్ట్రాన్ని ముందువరుసలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, గణేష్, రామారావు, రాములు, కిషన్, అయోధ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్‌గా సాయికుమార్


సాయికుమార్

కొత్తగూడ, ఆగస్టు 13: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్‌పార్టీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్‌గా పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన సిరబోయిన సాయి కుమార్‌ను మంగళవారం మండల కేంద్రంలో నియమించారు. సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, టీపీసీసీ జనరల్ సెక్రటరీ చల్లా నారాయణరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్‌కు సాయికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు దేగల భద్రయ్య, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యాక్షుడు చొప్పరి కుమారస్వామి, నాయకులు ఐలయ్య, శ్రీనివాస్, నవీన్, నర్సయ్య, యాకయ్య, వీరన్న, రవీందర్, కిరణ్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు అమరులను మరువరు

కురవి, ఆగస్టు 13 : కమ్యూనిస్టు పార్టీలో ప్రజల కోసం పనిచేస్తూ అమరులైన నాయకులను ప్రజలు ఎప్పటికి గుర్తుంచుకుంటారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. కురవిలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం లియాకత్‌అలీ 20వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, పోగుల శ్రీనివాస్, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, తురక రమేష్, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, కొంతం సత్యం, అప్పాల వెంకన్న, కర్నం ముత్తయ్య, బొల్ల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎంపిక


బాబురావు


విద్యాసాగర్

సీరోలు, ఆగస్టు 13 : సీరోలు మండల తెలంగాణ ప్రోగెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్. శ్రీశైలం ప్రకటించారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో మండలఅధ్యక్షుడిగా ఏ.బాబురావు, ప్రధానకార్యదర్శిగా సజ్జనము విద్యాసాగర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బొల్లం శ్రీనివాస్, విజయ్ కుమార్, శివకుమార్, సింగం మనోహర్, పి. రమేష్, వీరేందర్, రవీందర్, వేణు, సునీల్‌కుమార్, రహీముద్దీన్, రవికిరణ్, కిరణ్‌కుమార్, సుభాషిని, అశ్వినికుమారి పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 13 : మహబూబాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి కోరారు. మహబూబాబాద్‌లో మంగళవారంఎంపీ బలరాంనాయక్‌ను సీపీఐ నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారం,అభివృద్ధిపై సమగ్రంగాచర్చించారు. బి.విజయసారధి మాట్లాడుతూ...విభజన చట్టంలో పొందుపర్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

'పేదల సంక్షేమం కోసమే రాజకీయ రంగ ప్రవేశం'

దంతాలపల్లి, ఆగస్టు 13 : పేదలకు సేవ చేసేందుకే రాజకీయంలోకి వచ్చానని, స్వలాభం కోసం రాలేదని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని శ్రీబాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన యువజన కాంగ్రెస్ అధ్యక్ష కార్య వర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తే రానున్న స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపొందవచ్చన్నారు. గ్రామాల్లో పలుకు బడి ఉండి ప్రజాదరణ ఉన్న వారికి మాత్రమే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో టికెట్లు దక్కుతాయన్నారు. తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌ను దంతాలపల్లికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరడంతో మార్కెట్ చైర్మన్ పోస్టు మన చేతిలో లేదన్నారు. మండలంలో కొందరు సీనియర్లు ఉన్నారని వారితో పార్టీ పటిష్ఠతపై చర్చించి మండల సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బట్టు, పీఏసీఎస్ చైర్మన్ రాము, తాజా మాజీ సర్పంచులు కొమ్మినేని రవీందర్, సుష్మిత, తాజామాజీ ఎంపీటీసీ యాకయ్య, సతీష్, మండల నాయకులు పొన్నోటి బాలాజీ, సురేష్, లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి గ్రామ స్థల వివాదం

- తుమ్మలకు విన్నవించినట్లు అఖిలపక్ష నేతలు ప్రకటన

బయ్యారం, ఆగస్టు 13 : కొంత కాలంగా వివాదాస్పదంగా మారిన గ్రామ స్థలాన్ని రక్షించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించినట్లు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటన ద్వారా మండల అఖిలపక్ష నేతలు పేర్కొన్నారు. ప్రకటనలో అఖిలపక్ష నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో బయ్యారం గుట్టపై మైనింగ్ నిర్వహించిన సమయంలో గోగినేని శేషగిరిరావు ద్వారా గ్రామానికి లభించిన సుమారు 1800 గజాల స్థలాన్ని కబ్జా చేయటానికి కొందరు పూనుకున్నట్లు వెల్లడించారు. గోగినేని శేషగిరిరావు కుమారుడిని అడ్డం పెట్టుకొని మండలానికి చెందిన పలువురు గిరిజనులతో పాటు ఓ రెవెన్యూ ఉద్యోగి స్థలాన్ని ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గల ఈ స్థలానికి తాజాగా విలువ పెరగడంతో ఏజెన్సీ ప్రాంత చట్టాలను అనువుగా మలుచుకొని కబ్జా చేసేందుకు కుట్రలు పన్నుతున్నట్లు పేర్కొన్నారు. బస్టాండ్ సెంటర్ సమీపంలో గల ఈ స్థలానికి ఏళ్ల తరబడి పెన్సింగ్ వేసి రక్షణ ఏర్పాటు చేయగా.. తాజాగా రెవెన్యూ ఉద్యోగి తాను ఈ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు పేర్కొంటూ పెన్సింగ్ తీసేసి నిర్మాణం చేపడుతుండడం దారుణమన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనులకు వర్తించే పలు సాంకేతిక కారణాలను సాకుగా చూపి ఆ స్థలంపై గ్రామానికి అధికారంలేదని, అందుకే తాము కొనుగోలు చేశామని వితండ వాదన చేయడం గ్రామాభివృద్ధికి విఘాతం కలిగే చర్యగా నేతలు అభివర్ణించారు. గ్రామ స్థలాన్ని కబ్జా చేయడాన్ని నివారించేలా చర్యలు చేపడుతూ తద్వారా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరుతూ మంత్రి తుమ్మలకు విన్నవించినట్లు అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. కాగా, అఖిలపక్ష నేతల పేర సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈ ప్రకటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.

గంగారం చేరిన అబ్దుల్ అబిద్ 'హజ్‌యాత్ర'


కాలినడకన వస్తున్న అబ్దుల్ అబిద్

కొత్తగూడ, ఆగస్టు 13 : సౌదీ అరేబీయాలోని మక్కా మదీనాను దర్శించుకునేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన అబ్దుల్ అబిద్ చేపట్టిన హజ్‌యాత్ర మంగళవారం గంగారం మండలానికి చేరుకుంది. అబ్దుల్ అబిద్ సౌదీ అరేబీయాలోని మక్కా మదీనాను దర్శించుకునేందుకు కాలినడకన హజ్ యాత్ర (పాదయాత్ర) చేపట్టారు. హజ్‌యాత్ర ఐదు రాష్ట్రాలు, మూడు దేశాల మీదుగా 9వేల కిలో మీటర్లు అబీద్ హజ్‌యాత్ర కొనసాగనుంది. గంగారం మార్గమధ్యలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంఘం జిల్లా ముఖ్యకార్యదర్శి అబ్దుల్ నబీ ఆహారం అందించి, సన్మానించారు.ఆయన వెంట గుండాల మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఖాసీం ఉన్నారు. అబిద్ హజ్‌యాత్రను స్థానిక ముస్లింలు స్వాగతించారు.

అడవిపంది దాడిలో దంపతులకు గాయాలు



గాయాలపాలైన లచ్చు , కౌసల్య

కొత్తగూడ, ఆగస్టు 13 : అడవిపంది దాడిలో రైతు దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని రేణ్యా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నతండాలో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నతండాకు చెందిన బానోత్ లచ్చు తన భార్య కౌసల్యతో పాటు పొలంవద్దకు వ్యవసాయ పనులుచేసేందుకు వెళ్లారు. వ్యవసాయ పనులు చేసుకుంటుండగా దంపతులపై అడవి పంది ఒక్కసారిగా దాడికిదిగింది. దీంతో పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నారు. బానోత్ లచ్చు, కౌసల్యకు తీవ్రగాయాలయ్యాయి. దంపతుల అరుపులు, కేకలకు సమీపంలోని రైతులు సైతం పరుగులు తీశారు.

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయొద్దు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13 : ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి విద్యార్థులకు చదివిస్తున్న తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో స్థిరపడాలని మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 24వవార్డు పరిధిలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న స్పోర్ట్స్ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉప్పలయ్య, మార్నేని కిరణ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వీఎస్ఎస్ మండల యూత్ అధ్యక్షుడిగా దేవరాజు


దేవరాజు

నెల్లికుదురు, ఆగస్టు 13 : వడ్డెర సంక్షేమ సంఘం (వీఎస్ఎస్) మండల యూత్ అధ్యక్షుడిగా రామన్నగూడెం గ్రామానికి చెందిన బోంతు దేవరాజును మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు ఆలకుంట్ల సాంబరాజు తెలిపారు. యూత్ ఉపాధ్యక్షుడిగా ఇరగదిండ్ల ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా ఇరగదిండ్ల దేవరాజు, సహాయ కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా సూర రాకేష్, సభ్యులుగా ఇరగదిండ్ల అశోక్, అనిల్, రవిలను ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నాలుగు తరాల ఆత్మీయ కలయిక



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13 : మహబూబాబాద్ పట్టణానికి చెందిన బవిరిశెట్టి చంద్రయ్య-రత్నమ్మ కుటుంబీకుల నాలుగు తరాల ఆత్మీయ కలయిక అందరినీ ఆకట్టుకుంది. జిల్లా కేంద్రంలోని రవిచంద్ర కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం బవిరిశెట్టి నాలుగు తరాల కుటుంబీకులు ఆటా.. పాటలతో ఆనందోత్సవాల నడుమ వేడుకలు జరుపుకున్నారు. కుటుంబంలో మొదటి తరం పెద్దలు విశ్వనాథం, లక్ష్మి, మహేశ్వరరావు, ప్రమీల, సామ్రాజ్యం, వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. అనంతరం నేటి తరం పిల్లలకు తమ బంధువులను పరిచయం చేశారు. ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని శ్రీనాథ్, శ్రీధర్, కమల్, శివలు జరిపించారు. కాగా, నాలుగు తరాల కుటుంబీకుల కలయికతో నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచారు.

ఈ పాస్ యంత్రాల ద్వారా అమ్మకాలు జరపాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 13 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణంలో మంగళవారం వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మీనారాయణ తనిఖీలు నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఈ పాస్ యంత్రాల ద్వారానే యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల అమ్మకాలు జరపాలని ఆదేశించారు. రైతుల ఆధార్‌కార్డు నెంబర్లతోనే ఎరువులను అమ్మాలని, లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే తండాలకు మహర్దశ

చిన్నగూడూరు, ఆగస్టు 13 : మాజీ సీఎం కేసీఆర్ హయంలోనే గిరిజనతండాలకు మహర్దశ వచ్చిందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. ఉగ్గంపల్లిలోని రెడ్యానాయక్ స్వగృహం నందు బంజర తండాను గ్రామ పంచాయతీగా చేసినందుకు తండావాసులు, కందికొండ గ్రామస్థులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిచ్చిరెడ్డి, ఉద్యమనాయకులు రవినాయక్, యాక్యానాయక్, అయూబ్‌పాషా, హరినాయక్, సురేష్, మహేష్ పాల్గొన్నారు.

మొరాయించిన 102 వాహనం

కేసముద్రం, ఆగస్టు 13 : మండల కేంద్రంలో మంగళవారం 102 వాహనం మొరాయించింది.వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారానికి చెందిన ఐదుగురు గర్భిణులను అలంఖానిపేట పీహెచ్‌సీకి ఈ వాహనంలో తీసుకువెళ్తున్నారు. నాగారం-ఇంటికన్నె మధ్యలో వట్టివాగులో నీటి ప్రవాహం ఉండడంతో 102 వాహనం అర్పనపల్లి మీదుగా కేసముద్రం నుంచి అలంఖానిపేటకు వెళుతోంది. ఈ క్రమంలో స్థానిక ఫూలే సెంటర్‌కు రాగానే నిలిచిపోయింది.కొంతమంది యువకులు వాహనాన్ని ముందుకు వెనుకకు నెట్టి నడిపించేందుకు ప్రయత్నంచేసినప్పటికీ మొరాయించింది.మరో వాహనాన్ని తెప్పించి గర్భిణులను అలంఖానిపేటకు తరలించారు.

నేడు ముత్యాలమ్మకు బోనాలు

గూడూరు, ఆగస్టు 13: గూడూరు మండలం బ్రహ్మణపల్లిలో ముత్యాలమ్మ బోనాలు పండగను నిర్వహించనున్నారు. గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బుడిగె సతీష్‌గౌడ్ రూ.6 లక్షలను వెచ్చించి గ్రామంలో ముత్యాలమ్మతల్లి ఆలయ నిరాణానికి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా బుడిగే సతీష్ మాట్లాడుతూ.. తనవంతు బాధ్యతగా ముత్యాలమ్మ ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

తొర్రూరు, ఆగస్టు 13 : చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ జగదీష్ అన్నారు. మంగళవారం స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కేసులు నమోదైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లు, గొడవలు, భూ తగాదాలకు పాల్పడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్లు తప్పని సరిగా సిటీదాటి వెళ్ళితే స్టేషన్‌లో సంతకాలు చేయాలని, అధికారుల అనుమతులు తప్పనిసరి అన్నారు. వారిపై అనుమానంవస్తే బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్ పరిధిలోని ఎస్సైలు, రాంజీనాయక్, రమేష్, రాజు, క్రాంతి ఉన్నారు.

'స్ఫూర్తి' సేవలు అభినందనీయం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మంగళవారం స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.15వేల విలువగల టీ షర్టులు, టై,బెల్టులు అందజేశారు.పాఠశాల హెచ్‌ఎం జి. లక్ష్మీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు శ్రీధర్‌రెడ్డి, మేకల కృష్ణయ్య,ఎస్. ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి మయూరి, ఉపాధ్యాయులు ఆవునూరి రవి, వెంకటేశ్వర్లు, సువర్ణ, రాధిక, కవిత పాల్గొన్నారు.

పే స్కేల్‌ను వర్తింపజేయాలి

తొర్రూరు, ఆగస్టు 13: ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ వర్తింపచేయాలని కోరుతూ మంగళవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పిఏ. విజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో వినతిపత్రం అందించామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వెంటనే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సతీష్, వీరాంజనేయులు, గంగాధర్, దేవేందర్, యాకయ్య, సోమలక్ష్మి, ఎల్లమ్మ, హరీష్ ఉన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

మరిపెడ, ఆగస్టు 13 : ఏడాదిన్నర క్రితం ఆటో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మంగళవారం మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై సంతోశ్ బాధితుడికి అందచేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లంపేట రెవెన్యూ పరిధి సోమ్లాతండాకు చెందిన రేషన్ డీలర్ ఏడాదిన్నర క్రితం ఓ ఆటో మరిపెడబంగ్లా నుంచి ఇంటికి వెళ్లుతుండగా సెల్‌ఫోన్ పోయింది. సీఈఐఆర్ యాప్‌కు అనుసంధానం చేసి ఉంచారు. ఈ రోజు ఫోన్ ఆన్ కావడంతో గుర్తించి పోలీసులు ఆ ఫోన్ స్వాధీనం చేసుకొని బాధితుడికి ఇచ్చారు. సెల్‌ఫోన్ మిస్సైతే వెంటనే సీఈఆర్ఐ యాప్‌ద్వారా ఎవరి వద్ద ఉందో తెలిసి పోతుందని గుర్తు చేశారు.

బోదకాల నివారణపై అవగాహన

గంగారం(కొత్తగూడ), ఆగస్టు 13: గంగారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం బోదకాలు నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రత్యూష మాట్లాడుతూ బోదకాలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు బోదకాలు నివారణ మందులు పంపిణీచేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బోదకాలు నివారణ మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నిర్మల, ఆశా వర్కర్ ప్రతిభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఆరోగ్య అవగాహన సదస్సుకు తరలిరావాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 13 : రైతునేస్తం ఫౌండేషన్ స్వర్ణభారత్ ట్రస్టు సహకారంతో కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో చిరుధాన్యాలతో జీవన సిరిలో భాగంగా చిరుధాన్యాలు, కషాయాలు, యోగ, జీవన విధానం మూడ్రోజుల పాటు ఈ నెల 24 నుంచి 26 వరకు హైదరాబాద్‌లోని ముచ్చింతల్‌లోని స్వర్ణ భారత్ ట్రస్టులో జరిగే అరోగ్య అవగాహన సదస్సుకు మహబూబాబాద్ జిల్లా నుంచి తరలిరావాలని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎడ్లపల్లి వేంకటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9705383666, 7093973999 నెంబర్లకు కాల్ చేసి తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

18న మట్టి సేద్యంపై శిక్షణ

సేంద్రియ సాగులో మట్టి ద్రవణం తయారీ, మట్టి ప్రాముఖ్యతను పంటల సాగులో ఉపయోగించే పద్ధతులపై ఈ నెల 18న హైదరాబాద్‌లోని దక్షిణ భారత హింది ప్రచార సభ అవరణలో రైతు ఫౌండేషన్ కార్యాలయంలో ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వేంకటేశ్వర్‌రావు తెలిపారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

బయ్యారం, ఆగస్టు 13 : సీజనల్‌గా విజృంభిస్తున్న విషజ్వరాలను అదుపుచేసేలా గ్రామ గ్రామాన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మ, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా విజృంభిస్తున్న విషజ్వరాలను అరికట్టాలే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బయ్యారం పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేపట్టారు. అదే సమయంలోనే పీహెచ్‌సీని తనిఖీ చేసేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, బిక్షం, అనురాధ, నాగేశ్వరరావు, దేవిరెడ్డి, రాకేష్, రేణుక పాల్గొన్నారు.